AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in


## కొనసాగుతున్న డిగ్రీ వన్ టైమ్ ఛాన్స్ పరీక్షలు



**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ కోర్సుల 1, 2, 3, 4, 5, 6 సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ వన్ టైమ్ ఛాన్స్ పరీక్షలు కొనసాగుతున్నాయి. ఉదయం జరిగిన పరీక్షలకు 60 మంది విద్యార్థులకు 54 మంది, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 46 మంది విద్యార్థులకు 43 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.



## ఎన్యూమరేషన్ ఫారాలను గడువులోపు అందించాలి: కలెక్టర్ ఇలా త్రిపాఠి



**అక్షరటుడే, ఇందూరు:** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాన్ని పూరించి గడువులోపు బూత్ లెవెల్ అధికారికి అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. సోమవారం ప్రజావాణి అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులందరూ విధిగా ఈనెల 24వ తేదీ లోపు ఎన్యూమరేషన్ ఫారంను నింపి బీఎల్‌వోలకు అందించాలని కలెక్టర్ సూచించారు. లేని పక్షంలో ఆగస్టు 5న ప్రచురించే ఓటర్ల ముసాయిదా జాబితాలో పేరు కోల్పోతారన్నారు. ఈ విషయాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తేలికగా తీసుకోకూడదని, అధికారులు ఎంత పెద్ద హోదాలో, ఏ స్థాయిలో ఉన్నా ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు ఎన్యూమరేషన్ ఫారం అందించాల్సిందేనన్నారు. సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లను క్రమం తప్పకుండా సందర్శించాలని మండల ప్రత్యేక అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విద్యాసంస్థలను మొక్కుబడిగా సందర్శించకుండా, వాటి పనితీరును నిశితంగా పరిశీలించాలని, ఏమైనా సమస్యలు ఉన్నాయా అన్నది గమనించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రెయినీ కలెక్టర్ సురేష్, డీఆర్‌వో గీత, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, డీఆర్డీవో సాయన్న, డీపీవో శ్రీనివాస్ రావు, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.




## ప్రజావాణికి 131 ఫిర్యాదులు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 131 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్, భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్‌వో గీత, జిల్లా పరిషత్ సీఈవో సాయాగౌడ్, డీపీవో శ్రీనివాస్, డీఆర్డీవో సాయన్న, నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్‌ను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

**ఒకప్పుడు కామారెడ్డి నియోజకవర్గం బీఆర్ఎస్‌కు కంచుకోట. అలాంటి కంచుకోట నేడు కల కోల్పోయింది. సరైన దిశానిర్దేశం చేసే నాయకులు లేక క్యాడర్‌లో గందరగోళం నెలకొంది. మరోవైపు జిల్లా కమిటీలు లేక క్యాడర్ వెలవెలబోతున్నారు. ఇక్కడ కేసీఆర్ పోటీ చేసి ఓడిపోవడం కూడా పార్టీకి తీవ్రనష్టాన్ని మిగిల్చిందన్న టాక్ ఉంది. దాన్ని సరిదిద్దుకోవడానికి అవకాశం వచ్చినా.. పట్టించుకునే ముఖ్య నాయకులు లేరని పార్టీ క్యాడర్‌లో గుసగుసలు వినిపిస్తున్నాయి.**

**- అక్షరటుడే, కామారెడ్డి**




**కేసీఆర్ ఓటమి తర్వాత..**

2023లో కామారెడ్డి నుంచి కేసీఆర్ పోటీ చేసి ఓడిపోవడం పార్టీకి గట్టి దెబ్బ అని చెప్పవచ్చు. ఎన్నికల ఫలితాల్లో కేసీఆర్ రెండో స్థానంలో ఉండటంతో అధిష్ఠానం కామారెడ్డికి అంత ప్రాధాన్యం ఇవ్వడం లేదన్న టాక్ ఉంది. ఆ తర్వాత నుంచే ఈ జిల్లాను అధిష్ఠానం పక్కనపెట్టిందన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వంటి సీనియర్లెవరూ గత రెండున్నరేళ్లలో కామారెడ్డి గడ్డపై అడుగుపెట్టలేదు.

# పునర్నిర్మాణం జరిగేనా..!

- బీఆర్ఎస్ కమిటీలపై దృష్టి పెట్టని అధిష్ఠానం
- జిల్లాపై ఫోకస్ చేయని అగ్ర నాయకత్వం
- దిశా నిర్దేశం చేసే వారు లేక క్యాడర్‌లో ఆందోళన
- పట్టు కోల్పోతున్ గులాబీ పార్టీ

కామారెడ్డిలో బీఆర్ఎస్ పరిస్థితి గందరగోళంగా మారిందన్న టాక్ పొలిటికల్ వర్గాల్లో వినిపిస్తోంది. సరైన దిశానిర్దేశం లేక, జిల్లా కమిటీలు లేక క్యాడర్ వెలవెలబోతోంది. ఇప్పటికే అధిష్ఠానం పిలుపుల కోసం ఎదురు చూస్తూ రెండున్నరేళ్లు గడిచిపోయాయి. ప్రస్తుతం కొత్త నాయకత్వం కోసం క్యాడర్ ఆశగా ఎదురుచూస్తోంది.

**దృష్టి పెట్టని అధిష్ఠానం**

ఎన్నికల ఓటమి అనంతరం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కమిటీలన్నీ రద్దయ్యాయి. కామారెడ్డిలోనూ అదే పరిస్థితి. ఇప్పటివరకు కొత్త జిల్లా కమిటీ ప్రకటన లేదు. నియోజకవర్గ ఇన్‌ఛార్జీలకే పరిమితమైన వ్యవహారంతో పార్టీ కార్యకలాపాలు స్తంభించిపోయాయి. పైనుంచి ఎలాంటి ఆదేశాలు లేవు. మేం ఎవరి దగ్గరకు వెళ్లి మాట్లాడాలి..? అని మండల స్థాయి నేతలు, కిందిస్థాయి క్యాడర్ ప్రశ్నిస్తున్నారు. గత రెండున్నరేళ్లలో కామారెడ్డి జిల్లాస్థాయి క్యాడర్ మీటింగ్ ఒక్కటీ జరగలేదు. దాంతో ఇక్కడి పరిస్థితులను పట్టించుకోవడం లేదన్న భావన క్యాడర్‌లో బలంగా నాటుకుంది. పదవుల కోసం ఆశపడిన సీనియర్లు, మాజీ ప్రజాప్రతినిధులు కూడా అయోమయంలో పడ్డారు.

**కలిసొచ్చిన రైతుల అంశం..**

ప్రభుత్వంపై పోరాడేందుకు రైతు సమస్యలు బ్రహ్మాస్త్రంలా ఉన్నాయి. యూరియా కొరత, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, వరద కాల్వల నిర్లక్ష్యం అంశాలతో కిందిస్థాయి క్యాడర్ జనాల్లోకి వెళ్ళడానికి ప్రయత్నించినా ఆశించిన ఫలితం దక్కలేదు. కానీ వారికి అండగా నిలిచే టాప్ లీడర్లు మాత్రం కామారెడ్డి వైపు చూడడం లేదు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఒక్కరే ఉమ్మడి జిల్లా మొత్తాన్ని చుట్టేస్తున్నారు. అయినప్పటికీ నాయకత్వ లోటు స్పష్టంగా కనిపిస్తోంది. దీంతో బీఆర్ఎస్ కార్యక్రమాలు జనంలోకి వెళ్లడం లేదు.

**జోష్ నింపాల్సిన తరుణమిదే..**

ప్రస్తుతం స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్నాయి. కంచుకోటను తిరిగి దక్కించుకోవాలంటే ముందు క్యాడర్‌లో జోష్ నింపాలి. జిల్లా కమిటీని ప్రకటించి, సీనియర్ నేతల పర్యటనలు పెట్టి, క్యాడర్‌తో ముఖాముఖి మాట్లాడాలి. రైతు సమస్యలను అజెండాగా తీసుకుని బలమైన ఉద్యమం నిర్మించాలి. కామారెడ్డి బీఆర్ఎస్‌కు అవకాశం ఇంకా ఉందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి. అధిష్ఠానం ఈ కంచుకోటపై దృష్టి పెడితే, కోల్పోయిన పునాదులు తిరిగి బల పడతాయన్న టాక్ ఉంది. లేకుంటే పునర్నిర్మాణం ఎప్పుడు..? అనే ప్రశ్నకు మాత్రం సమాధానం దొరకదని కూడా ప్రచారం సాగుతోంది.



## కలెక్టరేట్‌లో పోలీసుల విస్తృత తనిఖీలు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కలెక్టరేట్‌కు వచ్చే ఉద్యోగులు, ఇతరులు వాహనాలకు నంబర్‌ప్లేట్లు లేకుండా.. ప్లేట్‌లను కిందికి వంచేసి కనిపించకుండా ఉండటం తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో సోమవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు తెలిపారు. నంబర్‌ప్లేట్స్ లేకుండా.. ఉన్నా వాటిని అడ్డదిడ్డంగా అమర్చిన వాహనాలను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చామని.. మరికొంతమందిపై పెట్టి కేసులు పెట్టామని తెలిపారు. 50మందికి జరిమానాలు విధించినట్లు వెల్లడించారు.



## శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

**అక్షరటుడే, బాన్సువాడ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి కలియుగ ప్రత్యక్ష దైవం అయిన తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆయన సతీమణి పుష్ప, కుమారులు రవీందర్ రెడ్డి, రాధిక దంపతులు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, సోని రెడ్డి దంపతులు, మనవరాళ్లు, మనుమలతో కలిసి ప్రత్యేక దర్శన సమయంలో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులకు మంచి పంటలు పండాలని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా వర్ధిల్లాలని శ్రీవారిని ప్రార్థించినట్లు పోచారం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలి: షబ్బీర్ అలీ



**అక్షరటుడే, కామారెడ్డి:** రైతులు ఆదాయాన్ని పెంచుకునేందుకు వరి వంటి సంప్రదాయ పంటలతో పాటు ఆదాయాన్నిచ్చే ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ సూచించారు. తన 12 ఎకరాల భూమిలో వరి సాగు నిలిపివేసి ఆయిల్ పామ్ మొక్కలను నాటి రైతులకు ఆదర్శంగా నిలిచారు. ఆయన మాట్లాడుతూ.. భూగర్భ జలాల పరిరక్షణ, నీటి వినియోగం తగ్గింపు, రైతుల ఆదాయం పెంపునకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. ఆయిల్ పామ్ వంటి వాణిజ్య పంటలకు భవిష్యత్తులో మంచి మార్కెట్ ఉంటుందని, స్థిరమైన ఆదాయం లభిస్తుందని వివరించారు. వరి సాగులో సాగునీరు, ఉత్పత్తి వ్యయం ఎక్కువగా ఉండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో నీటిని ఆదా చేసే పంటల సాగు అనివార్యమని, ఆయిల్ పామ్ ద్వారా దీర్ఘకాలికంగా మెరుగైన లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పంటల వైవిధ్యం పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు శాస్త్రీయ సలహాలు ఇస్తూ ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చేందుకు ప్రోత్సాహకాలు, సాంకేతిక సహకారం అందిస్తోందని షబ్బీర్ అలీ తెలిపారు.

## అఖండ భారత నిర్మాణానికి పునాదులు వేసిన దేశభక్తుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ



**అక్షరటుడే, ఇందూరు:** అఖండ భారత నిర్మాణానికి పునాదులు వేసిన గొప్ప దేశభక్తుడు శ్యామాప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. జనసంఘ్ పార్టీ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మారెడ్డి వనిత అధ్యక్షతన జరిగిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దినేష్ కులాచారి మాట్లాడుతూ.. శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవితం యువతకు ఆదర్శమన్నారు. కేవలం 33 ఏళ్ల అతి చిన్న వయసులోనే విశ్వవిద్యాలయానికి వైస్ ఛాన్సలర్ కావడమే ఆయన మేధస్సుకు నిదర్శనమన్నారు. వయసు చిన్నదైనా, ఆలోచన గొప్పగా ఉంటే ఏ శిఖరాన్నైనా అధిరోహించవచ్చని ఆయన మనకు నిరూపించారని తెలిపారు. 'ఏక్ దేశ్ మే దో విధాన్, దో ప్రధాన్, దో నిషాన్ నహీ చలేంగే' అని గర్జించిన ధీశాలి ఆయన అని దినేష్ అన్నారు. కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. 'ఒకే దేశం - ఒకే రాజ్యాంగం - ఒకే ప్రధాని' అన్న ఆయన ఆశయం, నేడు ఆర్టికల్ 370 రద్దుతో సాకారమైందన్నారు. ఇది ఆయనకు మనం ఇచ్చే నిజమైన ఘన నివాళి అని పేర్కొన్నారు. దేశ విభజనను, పాకిస్తాన్ ఏర్పాటును గట్టిగా వ్యతిరేకించిన ఏకైక గొంతుక ఆయనదన్నారు. ముఖర్జీ గారు చెప్పిన 'స్వదేశీ' స్ఫూర్తిని తీసుకుందామని.. స్థానిక వనరులను వాడుకుంటూ, కొత్త ఆవిష్కరణలు చేద్దామన్నారు. గద్దె భూమన్న, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నాగోళ్ల లక్ష్మీనారాయణ, ప్రమోద్ కుమార్, నిమ్మల శ్రీనివాస్, రాంచందర్, జ్యోతి, సవిత ఉప్పు, వర లక్ష్మి, వైష్ణవి , బిలోజి నాయక్, బొబ్బిలి వేణు, ఓం సింగ్, పురుషోత్తం, చింత శ్రీనివాస్ రెడ్డి, పుట్ట వీరేందర్, పిల్లి శ్రీకాంత్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## జీఆర్ఎం, ఎంఆర్ఎంతో సైబర్ బాధితులకు ఉపశమనం: ఎస్పీ



**అక్షరటుడే, కామారెడ్డి:** జీఆర్ఎం, ఎంఆర్ఎం మాడ్యూళ్ల ద్వారా సైబర్ నేర బాధితులకు త్వరితగతిన ఉపశమనం కల్పించాలని కామారెడ్డి పోలీసులు నిర్ణయించారు. ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాలతో సోమవారం జిల్లా సైబర్ క్రైం కో-ఆర్డినేషన్ సెంటర్ ఆధ్వర్యంలో అన్ని పోలీస్ స్టేషన్ల సైబర్ వారియర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలతో సంబంధం లేకుండా బ్యాంక్ ఖాతాలు లేదా నగదు ఫ్రీజ్ అయిన పౌరులు జీఆర్ఎం పోర్టల్ ద్వారా వినతి సమర్పించవచ్చని ఎస్పీ తెలిపారు. దర్యాప్తు అధికారి బ్యాంకులతో సమన్వయం చేసి నిబంధనల మేరకు అర్హుల ఖాతాలను డీ ఫ్రీజ్ చేస్తారని వివరించారు. సైబర్ మోసాలకు గురై నష్టపోయిన బాధితులకు ఎంఆర్ఎం మాడ్యూల్ ద్వారా రూ.50 వేల లోపు మొత్తాన్ని కోర్టు ఉత్తర్వులు లేకుండానే పరిశీలన అనంతరం తిరిగి అందజేస్తారన్నారు. దీంతో బాధితులకు వెంటనే న్యాయం అందడంతో పాటు కోర్టు ప్రక్రియకు పట్టే సమయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. జీఆర్ఎం, ఎంఆర్ఎం మాడ్యూళ్లను సమర్థంగా వినియోగించి ప్రజల వినతులను సత్వరమే పరిష్కరించాలని, బ్యాంకులు, దర్యాప్తు అధికారులతో సమన్వయం పెంచాలని సైబర్ వారియర్లకు ఎస్పీ ఆదేశించారు. ఈ విధానంతో పోలీసు సేవలు మరింత పారదర్శకంగా ప్రజలకు చేరువతాయని, శాఖపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందన్నారు.

## పోలీస్ నియామక పోస్టులను పెంచాలని నిరుద్యోగుల ర్యాలీ




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనున్న పోలీస్‌శాఖ నోటిఫికేషన్‌ను మార్చాలని సామాజిక తెలంగాణ ఫ్రంట్ డిమాండ్ చేసింది. ఈ మేరకు నగరంలో సెంట్రల్ లైబ్రరీ నుంచి కలెక్టరేట్ వరకు నడక ద్వారా ఫ్రంట్ ప్రతినిధులు, నిరుద్యోగులు నిరసన తెలిపారు. తెలంగాణ సామాజిక ఫ్రంట్ ప్రతినిధులు మాట్లాడుతూ.. పోలీస్‌శాఖలో 20వేలకు పైగా పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 5వేల వరకు మాత్రమే నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. లక్షల సంఖ్యలో నిరుద్యోగులు నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తుంటే ప్రభుత్వం అత్తెసరుగా 5వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దరఖాస్తుదారుల వయస్సును 38వరకు పెంచాలని డిమాండ్ చేశారు.



## వైటీపీఎస్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కొనసాగుతున్న నిరసన

**అక్షరటుడే, మెండోరా:** యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంలోని కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్, యాష్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించేందుకు యాజమాన్యం నిర్ణయించింది. దీనిని వ్యతిరేకిస్తూ.. పోచంపాడ్ జల విద్యుత్ కేంద్రంలో టీజీపీఈజేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమాలు 14వ రోజుకు చేరుకున్నాయి. ఉద్యోగులు భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. సీహెచ్‌పీ, ఏహెచ్‌పీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ ప్రయత్నాలను పూర్తిగా విరమించుకునే వరకు తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. టీజీపీఈజేఏసీ పిలుపు మేరకు జూలై 7న నిర్వహించనున్న 'ఛలో వైటీపీఎస్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి మద్దతు తెలపాలని పోచంపాడ్ శాఖ నాయకులు పిలుపునిచ్చారు.

బస్సులు, ప్రయాణికులతో సందడిగా ఉండాల్సిన బస్టాండ్ ఆకతాయిలకు అడ్డాగా మారింది. తాడ్వాయి మండల కేంద్రంలోని బస్టాండ్ శిథిలావస్థకు చేరడంతో వినియోగించడం లేదు. దీంతో మందుబాబులు అక్కడే సిట్టింగ్ వేస్తున్నారు.

- అక్షరటుడే, కామారెడ్డి




# తాడ్వాయి బస్టాండ్..

■ నిరుపయోగంగా ప్రయాణ ప్రాంగణం ■ అసాంఘిక కార్యకలపాలకు కేంద్రంగా మారిన వైనం ■ వృద్ధులు, విద్యార్థుల అవస్థలు

మండలానికి గుండెకాయ లాంటి ఈ బస్టాండ్ నేడు శిథిలావస్థకు చేరి ప్రజలను భయపెడుతోంది. బస్సుల హారన్లు, జనాల రద్దీతో సందడిగా ఉండాల్సిన ఈ ప్రాంతం పూర్తిగా నిర్మానుష్యంగా మారింది. పైకప్పు నుంచి సిమెంట్ పెచ్చులు ఊడిపోయి ఇనుప రాడ్లు బయటపడ్డాయి. ఏ క్షణంలో ఏది కూలిపడుతుందో అన్నంత ప్రమాదకరంగా ఉండటంతో గత కొన్నేళ్లుగా ఆర్టీసీ అధికారులు ఇక్కడ బస్సులు ఆపడమే మానేశారు.

### వృద్ధులు, విద్యార్థులకు ఇబ్బందులు

వృద్ధులు, మహిళలు, విద్యార్థులు ఎండకు, వానకు తడిస్తూ రోడ్డు మీద నిలబడి వచ్చే బస్సులను చేయి చూపి ఆపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. బస్టాండ్ ఆవరణ మొత్తం విరిగిన సీసాలు, మద్యం బాటిళ్లు, చెత్తతో నిండి పోయింది. పగలు, రాత్రి తేడా లేకుండా ఆకతాయిలు, మందుబాబులు ఇక్కడే తిష్ట వేయడంతో సామన్య ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఈ బస్టాండ్ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. పాచి పట్టిన గోడలు, దుమ్ము కొట్టుకుపోయిన స్తంభాలు, బయటి పోస్టర్ల మాటున కప్పిపుచ్చలేని నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది. మండల కేంద్రంలో ప్రభుత్వానికి ఇంత చులకనగా ఉందా అని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బస్సులు ఇక్కడ ఆగితే ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి. ప్రజా సౌకర్యం కోసం కట్టిన ఈ భవనం ఇప్పుడు ప్రజలకే శాపంగా మారింది. వెంటనే దీన్ని కూల్చివేసి కొత్త బస్టాండ్ నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ పకడ్బందీగా చేపట్టాలి



**అక్షరటుడే, ముప్కాల్:** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని పకడ్బందీగా, వేగవంతంగా పూర్తి చేయాలని ముప్కాల్ తహశీల్దార్ ముంతాజ్‌బోద్దీన్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల ప్రాధాన్యం, వాటి వివరాలను స్పష్టంగా తెలియజేస్తూ సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ప్రతి అర్హుడికి ఎన్యుమరేషన్ ఫారాలు అందేలా చూడాలని, విధుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా బాధ్యతాయుతంగా పనిచేయాలని బీఎల్‌వోలకు సూచించారు.



## బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి

**అక్షరటుడే, కోటగిరి :** మండల కేంద్రంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతిని సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సోంపూర్ పోచీరాం ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోచీరాం మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రావు దేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. రక్షణ, కార్మిక, రైల్వే శాఖ మంత్రిగా దేశానికి ఎనలేని సేవలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు కన్నం శ్రీనివాస్, గ్రామ అధ్యక్షుడు దినేష్, అస్కుల రవి, పేగు లాలయ్య, సుధాకర్, అశోక్, అబ్బాయ్య, నజీర్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

## భూముల రీసర్వేకు సహకరించాలి




**అక్షరటుడే, కోటగిరి :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ భారతి కార్యక్రమంలో భాగంగా భూముల రీసర్వేకు రైతులు సహకరించాలని అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్ కోరారు. కోటగిరి, ఉమ్మడి పోతంగల్ మండలం లోని తిర్మలాపూర్ గ్రామంలో సోమవారం గ్రామస్తులు రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏడీ శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఆధునిక పరిజ్ఞానంతో పక్కాగా గ్రామాల్లో బౌండరీలు నిర్మిస్తామన్నారు. ప్రతి గ్రామంలో రెండు సమస్యలు ఉంటాయని ఒకటి, గట్టు పంచాయతీ, రెండోది విలేజ్ బౌండరీ సమస్యలను ఉంటాయన్నారు. కాబట్టి వాటి శాశ్వత పరిష్కారం కోసం భూ భారతి భూముల రీ సర్వే ద్వారా లభిస్తుందన్నారు.. గతంలో ఉన్న సర్వే నంబర్ల పద్ధతి సక్రమంగా లేనందున కొత్తగా ప్రణాళిక ప్రకారం సర్వే నంబర్లు వస్తాయన్నారు. ప్రస్తుతం కొత్తగా సర్వే చేసిన అనంతరం పక్కాగా ఆధార్‌తో భూములు అనుసంధానం అవుతాయని.. తద్వారా ఆధార్ నంబర్ టైప్ చేస్తే రాష్ట్రంలో భూములు ఎక్కడున్నా తెలిసిపోతుందన్నారు. సర్వే రోజుల్లో గ్రామస్తులు తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. సర్వే రిపోర్టు వచ్చిన అనంతరం 60 రోజుల లోపల తప్పులు ఉంటే అప్లై చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వం చేసే ఈ సర్వేను ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ సందీప్, సర్పంచ్ బోయి సైదవ్వ, డీఐవోఎస్ దత్తు, ఎన్ఎస్ఎఫ్ కోర్ కమిటీ సభ్యులు విశ్వనాథ్, సర్వేయర్ పోశెట్టి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పుప్పాల శంకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## రెంజర్ల మార్కెట్ వద్ద ఆర్టీసీ బస్టాప్ కోసం వినతి

**అక్షరటుడే, ముప్కాల్:** మండలంలోని రెంజర్ల గ్రామంలోని అంగడి బజార్ (సంత) వద్ద ఆర్టీసీ బస్సు ఆపేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ సర్పంచ్ బొమ్మెర లావణ్య తరపున ఆమె భర్త భూమేశ్వర్ కోరారు. ఈ మేరకు మెట్‌పల్లి డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామ ప్రజలు, వ్యాపారులు ప్రతి వారం సంతకు రాకపోకల కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, మార్కెట్ వద్ద బస్సు నిలిపితే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెంజర్ల అంగడిబజార్ వద్ద ఆర్టీసీ బస్సు నిలిపేలా తగినచర్యలు తీసుకోవాలని డిపో అధికారులను కోరారు.



## ఘనంగా ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు జన్మదిన వేడుకలు

**అక్షటుడే, పెద్దకొడప్‌గల్:** మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు శ్యామప్ప పటేల్ ఆధ్వర్యంలో జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీ కాంతారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ నాయకులతో కలిసి కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ నాయకులు ఒకరికి ఒకరు కేక్ తినిపించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం శ్యామప్ప పటేల్ మాట్లాడుతూ ఎమ్మెల్యే జుక్కల్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు మహేందర్, బన్సీలాల్, సర్పంచ్ వినోద్, ఉప సర్పంచ్ నాగనాథ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఎదుట వామపక్ష విద్యార్థి సంఘాలు నిరసన తెలిపాయి. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యా రంగాన్ని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి విస్మరించడం తగదన్నారు. యూనివర్సిటీకి అధిక నిధులు కేటాయించి, ఖాళీగా ఉన్నా అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వామపక్ష విద్యార్థి నాయకులు రఘురామ్, అనిల్ కుమార్, అనిల్, నిరంజన్, చందు, భార్గవి, నితిన్ తదితరులు పాల్గొన్నారు.






## క్రీడాసామగ్రి అందజేత

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మండలంలోని ఇస్సాపల్లి ఉన్నత పాఠశాలకు ఉప సర్పంచ్ సట్లపల్లి చిన్న ముత్తెన్న రూ.6వేల విలువ ఉన్న క్రీడాసామగ్రి సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పున్నం, అనంతరావు, పాఠశాల సిబ్బంది సత్పుతె శ్రీనివాస్, కృష్ణారెడ్డి, అర్పిత, అరుంధతి, కృష్ణచైతన్య, రమేష్, స్వర్ణలత, రామకృష్ణ, ఆదుముల్లా, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## 'బడా భీమ్‌గల్' రోడ్డు మరమ్మతు పనులకు శ్రీకారం

**అక్షరటుడే, భీమ్‌గల్:** గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిని, రాకపోకలకు ఇబ్బందిగా మారిన భీమ్‌గల్ శివారులోని బడా భీమ్‌గల్ రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించింది. ఈ రహదారితో పాటు పాక్షికంగా దెబ్బతిన్న వంతెన మరమ్మతు పనులను సోమవారం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు కలిసి ప్రారంభించారు. గత వానాకాలంలో కురిసిన భారీ వర్షాలకు బడా భీంగల్ రోడ్డు పలుచోట్ల కొట్టుకుపోవడంతో వాహనదారులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రత్యేక చొరవతో పనులు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొదిరె నాగమణి స్వామి, మాజీ ఎంపీపీ కన్నె సురేందర్ ఇతర నాయకులు భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. వైస్ ఛైర్‌పర్సన్ జేజే నర్సయ్య, కౌన్సిలర్లు నాగేంద్రబాబు, అనంతరావు, సంగ్యా నాయక్ పాల్గొన్నారు.






## పంజాబ్‌లో అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** పంజాబ్‌లోని గంగానగర్‌లో బాలికపై జరిగిన అత్యాచార ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని ఐద్వా జిల్లా కార్యదర్శి బెజుగం సుజాత అన్నారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అత్యాచారాలకు అడ్డగా మారిందన్నారు. నార్త్ ఇండియాలో ఎక్కువ సంఖ్యలో బాలికలపై హత్యాచారాలు పెరిగాయని ఆమె ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం వెంటనే ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకురాళ్లు శ్రీదేవి, లక్ష్మి, అంజమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## 7న ఆర్టీసీ కార్గో కార్యాలయంలో వేలం

**అక్షరటుడే, ఇందూరు:** నగరంలోని ఆర్టీసీ కార్గో కార్యాలయంలో ఎవరూ స్వీకరించని పార్శిళ్లకు ఈనెల 7న వేలం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డిపో-1 మేనేజర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ప్రకటన విడుదల చేశారు. ఈ పార్శిళ్ల వేలంలో ప్రదర్శించే వస్తువులపై పదిశాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు ఆయన వివరించారు. ఆసక్తి గల వారు బస్టాండ్‌లోని ఆర్టీసీ కార్గో కార్యాలయంలో మధ్యాహ్నం 3 గంటలకు హాజరుకావాలని సూచించారు.




## ఆలూర్‌లో రైతు భరోసా సంబరాలు..

**అక్షరటుడే, ఆర్మూర్ :** మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దేగాం ప్రమోద్ ఆధ్వర్యంలో రైతు భరోసా సంబరాలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేసిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఆర్మూర్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి వినయ్ కుమార్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. దేగాం ప్రమోద్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. రైతుల ఆర్థికాభివృద్ధికి రైతు భరోసా పథకం ఎంతో ఉపయోగపడుతుందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఆలూర్ సర్పంచ్ ముక్కెర విజయ్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లారెడ్డి, కాంగ్రెస్ పార్టీ కల్లెడి అధ్యక్షుడు నీలగిరి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా నాయకులు మూలకిడి శ్రీనివాస్ రెడ్డి, పస్కా నర్సయ్య జిల్లా సెక్రటరీ, దేగాం శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ మోతీరాం, నాయకులు ప్రభాకర్, శశి, జితేందేర్, గంగారెడ్డి, ఉదయ్, నవనీత్, భాస్కర్, నారాయణ, చిరంజీవి నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

